'వంజర్ల అభివృద్ధికి కృషి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

లాలాపేట: తెలంగాణలోని వంజరి సామాజిక వర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తార్నాకలోని వంజరి భవన్‌లో ఆదివారం తెలంగాణ వంజరికుల రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎంపీ ఈటల రాజేందర్ ముందు ప్రస్తావించారు. ఈటల మాట్లాడుతూ ప్రత్యేకమైన కుల వృత్తి లేని కారణంగా వంజర్లు వెనుకబడి ఉన్నారని కావునా మీ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు. తెలంగాణ వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం పాల్గొన్నారు.

సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



సన్మానగ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

రాంగోపాల్‌పేట్: సనాతన హిందూ ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీ కృష్ణ సేవా సంస్థ అధ్యక్షులు చాముండేశ్వరి మహర్షి అన్నారు. సికింద్రాబాద్‌లోని హరిహరకళా భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆదివారం లలిత కళా సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి సన్మానం నిర్వహించారు. అలాగే చాముండేశ్వరి మహర్షికి తేజోబ్రహ్మ బిరుదుని అందించి ఘనంగా సత్కరించారు. ఆధ్యాత్మిక, వైదిక, పురోహితులు, శాస్త్రవేత్తలు, సామాజిక సేవకులకు వివిధ బిరుదులను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మిస్ సౌత్ ఇండియా, సినీనటి సుగమ్య శంకర్ భరతనాట్యం అలరించింది. ఈ కార్యక్రమంలో టీవీ నటుడు అనిల్, భాస్కరచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చిలకలగూడ: మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి నేతృత్వంలో ఆదివారం చిలకలగూడ చౌక్‌లోని మహాత్మగాంధీ విగ్రహానికి శుద్ధి చేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాజేశ్వరరావు, బీజేపీ నాయకులు కనకట్ల హరి, ప్రతాప్, సురేందర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



సికింద్రాబాద్: తెలంగాణ వీరభద్రీయ కుల సంఘం పార్శిగుట్ట నూతన కమిటీ ఎన్నిక ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులుగా మల్లారి సునీల్, వర్కింగ్ ప్రెసిడెంట్ మిట్టపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి మహంకాళి రమేష్, కోశాధికార మొట్టపల్లి వెంకట్, ముఖ్య సలహాదారులు రావుల సమ్మయ్య, రావుల లింగయ్య, మహంకాళి సుదర్శన్, మల్లారి నాగులు, ఉపాధ్యక్షులు ఉపేందర్, శివకవిరాజు, రామచందర్, రావుల సతీష్, మల్లారి లింగమూర్తి, మిట్టపల్లి జగదీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీస్‌గా కందుకూరి సైదులు, మహంకాళి సాయి, కాటి వంశీలను నియమించారు.

దేవుడి పాత ఫొటోలు, కేలండర్ల సేకరణ



సేకరించిన వస్తువులతో ఏవీసీఐ ప్రతినిధులు

సనత్‌నగర్: పాతబడి వినియోగం లేకుండా ఉన్న దేవుళ్ల ఫొటోలు, విగ్రహాలు, కేలండర్లు, ఇతరత్రా వస్తువులను సేకరించేందుకు ఆర్యవైశ్య కమ్యూనిటీ ఇంటర్నేషనల్ (ఏవీసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో దాదాపు 350కి పైగా ఫొటోలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, క్యాలెండర్లు, పూజా సామాన్లు, విగ్రహాలను ఇక్కడ అందజేశారు. ఏవీసీఐ వ్యవస్థాపక చైర్మన్ కేఎస్ఆర్ మూర్తి, కమిటీ సభ్యులు తులసీగుప్తా, కిరణ్‌గుప్తా, బీజేపీ సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగరావు, ఆకూరి శ్రీనివాసరావు, ఆకుల మహేష్, కుషాల్, ఏవీసీఐ వాలంటీర్లు లక్ష్మణ్, అర్చనలతో పాటు ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతంతే..!

పౌర సేవలు నామమాత్రం ● అలంకార ప్రాయంగా వార్డు కార్యాలయాలు

- డుమ్మా కొడుతున్న అధికారులు
- సర్కిల్‌బాట పడుతున్న ప్రజలు

పరిపాలన విధానాల వికేంద్రీకరణ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం పేరుతో ఏడాది క్రితం జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఏడాది కాలం గడిచిందో లేదో.. తిరిగి వార్డు కార్యాలయాలు అన్నీ నామమాత్రపు సేవలకే పరిమితమయ్యాయి. – సికింద్రాబాద్



సీతాఫల్‌మండి వార్డు కార్యాలయం

జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఉండే పౌర సేవలను ప్రజల ముంగిట్లోకి తెచ్చేందుకు గత ఏడాది వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య సమస్యలు మొదలు వివిధ విభాగాలకు చెందిన 10 విభాగాల సేవలు వార్డు కార్యాలయాల నుంచే అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా విభాగాల అధికారులు ఆసీనులయ్యేందుకు ప్రత్యేక ఛాంబర్లు, అవసరమైన వసతులు ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో వార్డుకు ఒక్కటి చొప్పున ఐదు కార్యాలయాలు ఏర్పాటు చేశారు. కంప్యూటర్లు, ఫర్నీచర్ తదితర అధునాతన ఏర్పాట్లు చేశారు. కార్యాలయాల పర్యవేక్షణ కోసం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారిని నియమించారు.

పాత విధానాలకే పరిమితం..

వార్డు కార్యాలయాల సేవలు మళ్లీ పాత పద్ధతులకే పరిమితం అవుతున్నాయి. లోగడ కేవలం జనన. మరణ ధృవీకరణ పత్రాల జారీ, పారిశుద్ధ్య పనుల వరకే పరిమితంగా ఉండేవి. ఏడాది క్రితం భారీ వ్యయంతో కార్యాలయాలు ఆధునీకరించినా అధికారులు గైర్హాజరు అవుతున్న నేపథ్యంలో మళ్లీ పాత రెండు సేవలకే కార్యాలయాలు పరిమితం అయ్యాయి. రోజుకు 20 నుంచి 40 వరకు ఫిర్యాదులు వార్డు కార్యాలయానికి వచ్చేవి. కొద్ది రోజులుగా ఒక్క ఫిర్యాదు కూడా అందని వార్డు కార్యాలయాలు ఉంటుండడం గమనార్హం. ట్యాక్సు, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అధికారులు మొత్తంగా వార్డు కార్యాలయానికి రావడం మానేయడంతో ఆయా అవసరాల కోసం పౌరులు వార్డు కార్యాలయాలకు రావడం మానేస్తున్నారు. కొత్తలో పౌరుల సందడితో కళకళలాడిన వార్డు కార్యాలయాలు నేడు బోసిపోయి కనిపిస్తున్నాయి.

ఉన్నతాధికారులు స్పందించాలి

అధికారులు వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు స్థానికంగా వ్యక్తమవుతుండగా, ప్రజలే వార్డు కార్యాలయాలకు రావడం లేదని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు. సర్కిల్ కార్యాలయానికి వస్తే సత్వరంగా పరిష్కారం లభిస్తుందన్న భావనతోనే వివిధ సేవల నిమిత్తం ప్రజలు సర్కిల్ కార్యాలయానికి వస్తున్నారని అంటున్నారు. ఇదిలా ఉండగా ఉన్నతాధికారులు పిలిచారని, సర్కిల్ కార్యాలయంలో పని ఉందన్న సాకుతో దాదాపు అన్ని విభాగాల అధికారులు వార్డు కార్యాలయాలకు రావడం లేదని జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి అన్ని విభాగాల అధికారులను మధ్యాహ్నం సమయం నుంచి వార్డు కార్యాలయంలో అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకుని తమ సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల అనంతరం..

వార్డు కార్యాలయాల సేవలు ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ముందు వరకు సక్రమంగానే కొనసాగాయి. అప్పటి వరకు ట్యాక్సు, పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ విభాగాల అధికారులు వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉండేవారు. డివిజన్ పర్యటనలు ముగించి మధ్యాహ్నం నుంచి వార్డు కార్యాలయానికి అధికారులు చేరుకుని ప్రజల ఫిర్యాదులపై సమీక్షలు చేసేవారు. సమస్యల పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేవారు. ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి... ఎన్నికల విధుల పేరుతో వార్డు కార్యాలయం నుంచి కాలు బయట పెట్టిన అధికారులు ఇప్పటికీ తిరిగి వచ్చిన దాఖలాలు లేవు. ప్రధాన విభాగాల అధికారులు సర్కిల్ కార్యాలయానికే పరిమితం అవుతున్నారు. దరఖాస్తు దారులను అక్కడికే రావాల్సిందిగా సంకేతాలు ఇస్తున్నారు. క్రమేణా అధికారుల హాజరు కరవు అవుతుండడంతో తమ సమస్యలు పరిష్కరించేకునేందుకు దరఖాస్తు దారులు సైతం సర్కిల్ కార్యాలయం బాట పడుతున్నారు.

కనుల పండువగా విద్యాకోటి కుంకుమార్చన మహాయజ్ఞం



మహాయజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ స్కందగిరి దేవాలయంలో ఆదివారం విద్యాకోటి కుంకుమార్చన మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య అత్యంత ఘనంగా నిర్వహించారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వర్ రావు, చేవేళ్ల ఎం.పి కొండా విశ్వేశ్వర రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల సమస్యలపై నేడు నిరాహారదీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, వీసీలను నియమించాలని సోమవారం నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఏబీవీపీ నాయకులు ఆదివారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 7 నెలలు కావస్తున్నా ఇంత వరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేదని, రాష్ట్రంలోని 10 వర్సిటీలకు మూడు నెలలుగా పర్మనెంట్ వీసీలు లేకుండా పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగే దీక్షలో విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు పాల్గొనాలని ఏబీవీపీ స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్ కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం



బేగంపేట ప్రకాష్‌నగర్ శ్రీనల్లపోచమ్మ ఆలయాన్ని సందర్శించిన బండి రమేష్

సనత్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమప్రాధాన్యతనిచ్చి వారి సంక్షేమం, అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తుందని కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ ప్రకాష్‌నగర్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. ముందుగా స్థానికంగా ఉన్న శ్రీనల్ల పోచమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రకాష్‌నగర్‌లోని ఎస్సీ, బీసీ కమ్యూనిటీ హాల్‌లో నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్ సూదం, రమేష్, అరుణ్, నర్సింగ్‌రావు, బాలు, పర్వేజ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరు

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యారంగ సమస్యల పై పోరుకు సిద్ధం కావాలని పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్ పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న ఆందోళన కార్యక్రమ వివరాల కరపత్రాన్ని ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద విడుదల చేశారు. అధిక ఫీజుల పెంపుతో పాటు పాఠశాల నుంచి యూనివర్సిటీల వరకు అనేక సమస్యలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపూరి పవన్, పాలేష్, భద్రం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల మధ్య వేడుకలు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్‌లో ఆదివారం బోనాల వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పెద్ద ఎత్తున ఆలయాలకు తరలి వచ్చి అమ్మవారికి బోనం, సాకను సమర్పించారు. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, బోలక్‌పూర్, ఐడిహెచ్ కాలనీ, బండ మైసమ్మనగర్, చాచానెహ్రునగర్, గాంధీనగర్, రైల్ కళారంగ్ బస్తీ, న్యూబోయిగూడ, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో అమ్మవారి బోనాల సంబరాలు అంబరాన్ని తాకాయి. వీధులన్నీ బోనాల పండుగ వాతావరణంలో కోలాహలంగా కనిపించాయి. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, బీజేపీ నాయకులు మర్రి పురురవరెడ్డి , లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు జి. పవన్‌కుమార్ గౌడ్ తదితరులు బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు దేవాలయాల్లో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రసూల్‌పురా: శ్రావణమాస బోనాల జాతర కంటోన్మెంట్‌లోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఆదివారం బోర్డు మూడవ వార్డు అన్నానగర్‌లోని పోచమ్మ, పెద్దమ్మ, బీరప్ప, రేణుక ఎల్లమ్మ, మైసమ్మ ఆలయాలతో పాటు మడ్‌ఫోర్ట్ లోని దక్షిణ కాళి, నల్లపోచమ్మ, కార్ఖాన మహంకాళి ఆలయాల్లో కొలువై ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనాలు, నైవేద్యం సమర్పించారు. బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత సాయన్న, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్, మంద కార్తీక్ ఇతర నాయకులు అమ్మవార్లను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

కోడి పందేలు ఆడుతున్న 9 మంది అరెస్టు



కంటోన్మెంట్: కోడి పందేలు ఆడుతున్న 9 మంది నిందితులను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బోయిన్‌పల్లిలోని వాటర్ ట్యాంక్ లేన్‌లో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు బోయిన్‌పల్లి పోలీసులు వెళ్లి నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8290 నగదు, 3 పందెం కోళ్లు, 7 మొబైల్ ఫోన్లు, 24 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

డిగ్రీ కాలేజీల అధ్యాపకులను నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం (టీడీఎల్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్‌కుమార్ ఆదివారం డిమాండ్ చేశారు. కాలేజీల్లో అధ్యాపకుల కొరత కారణంగా బోధన జరగడం లేదన్నారు. పర్మనెంట్ అధ్యాపకులను భర్తీ చేసే వరకు గెస్ట్ లెక్చరర్స్‌ను నియమించాలన్నారు. సుమారు 950 గెస్ట్ లెక్చరర్స్ అవసరమన్నారు.

పోగొట్టుకున్న లగేజీ ప్రయాణికుడికి అందజేత

సికింద్రాబాద్: రైలులో ప్రయాణికుడు పోగొట్టుకున్న బ్యాగు, ఇతర వస్తువులను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని తిరిగి యజమానికి అప్పగించారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన మేరకు.. రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో మంగేష్ భాగ్ అనే వ్యక్తి ఢిల్లీ నుంచి బెంగుళూర్ వెళ్తున్నాడు. అతనితో పాటు రూ. 5 లక్షల విలువగల సెల్‌ఫోన్, మెషినరీ ఐటమ్స్, టూల్స్ తీసుకెళ్తున్నాడు. కాజీపేట్ రైల్వే స్టేషన్‌లో వాటర్ బాటిల్ కోసం రైలు దిగిన అతను తిరిగి వచ్చే సరికి రైలు వెళ్లిపోయింది. వెంటనే రైల్ టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేసి విషయాన్ని వివరించాడు. అప్రమత్తమైన పోలీసులు రైలులో అతని బ్యాగును స్వాధీనం చేసుకొని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో సదరు బ్యాగు ఇతర వస్తువులను అందజేశారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి

అడ్డగుట్ట: వినాయక చవితి వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలని లాలాగూడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం పీఎస్ పరిధిలోని మండల నిర్వాహకులు, మైత్రి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేయనున్న మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎస్ఐలు షాహీద్‌పాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ ముఠా అరెస్టు

సనత్‌నగర్: రోడ్డుపై ఒంటరిగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను బేగంపేట పోలీసుల సహకారంతో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. తూర్పు సిక్కింకు చెందిన ప్రేమ్ రే (34), నేపాల్‌కు చెందిన నీరాజన్ తిరువ్ (20), బిక్రమ్ బుధ (22), బిషల్‌కుమార్ (22)లు నగరానికి వలసవచ్చి సింధికాలనీ, రాణిగంజ్, గాంధీనగర్ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరంతా స్నేహితులు. సులభంగా డబ్బు సంపాదించడానికి ఒక బృందంగా ఏర్పడి ఒంటరిగా వెళ్తున్న వారిని టార్గెట్ చేసి వారి వద్ద సెల్‌ఫోన్, ఇతరత్రా విలువైన వస్తువులు దోపిడీ చేస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 10న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నలుగురు నిందితులు బిషాల్‌హౌస్ వద్ద కలుసుకుని ప్రేమ్‌రేకు చెందిన యాక్టివాపై రసూల్‌పురా చౌరస్తా వద్దకు వచ్చారు. అక్కడ ఇద్దరు వ్యక్తులు నిలబడి ఉండగా ఇది గమనించిన నీరాజన్ తిరువ్, బిక్రమ్ బుధా, బిషల్‌కుమార్‌లు ద్విచక్ర వాహనంపై నుంచి కిందికి దిగి వారి వద్దకు వెళ్లి మీ వద్ద ఉన్న మొబైల్స్ ఇవ్వాలని బెదిరించారు. అయితే వారు ఇవ్వడానికి నిరాకరించినప్పటికీ బలవంతంగా వారి నుంచి మొబైల్ ఫోన్లను లాక్కొని అదే వాహనంపై పరారయ్యారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. దోపిడీకి ఉపయోగించిన బైక్‌పై ఆదివారం తిరుగుతుండగా బేగంపేట పోలీసులతో కలిసి నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్ఐలు శ్రీనివాసులుదాసు, జ్ఞానదీప్ బృందం వారిని అదుపులోకి తీసుకుని విచారించింది. నేరాన్ని ఒప్పుకోవడంతో నిందితులను తదుపరి విచారణ నిమిత్తం బేగంపేట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వారి వద్ద నుంచి నిందితులకు చెందిన నాలుగు సెల్‌ఫోన్లు, దోపిడీ చేసిన రెండు సెల్‌ఫోన్లు, హోండా యాక్టివా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా దోపిడీ ముఠాను చాకచాక్యంగా పట్టుకున్న బృందాన్ని టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర అభినందించారు.

బోనాల సంబరాలు

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో ఆదివారం బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. ఆయా ఆలయాల వద్ద మహిళలు బోనం తీసుకొని అమ్మవారికి సమర్పించారు. ఉదయం నుంచే భక్తులు దర్శనానికి పోటెత్తారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కంటోన్మెంట్‌లో...



బోయిగూడ ఉప్పలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి



బోయిగూడ ఉప్పలమ్మ దేవాలయంలో



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్



అడ్డగుట్టలో బోనంతో మహిళలు



నల్లపోచమ్మ ఆలయంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి



గాంధీ ఆస్పత్రిలో బంగారుమైసమ్మ ఆలయం వద్ద..